వేరుశనగ సాగులో మెలకువలు పాటించాలి

ఆమనగల్లు, జనవరి 22: వేరుశనగ సాగులో రైతులు తగిన మెలకువలు పాటించాలని ఏవో అరుణకుమారి సూచించారు. చీడపీడల నివారణలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండలంలోని చెన్నంపల్లి గ్రామంలో సోమవారం ఏవో అరుణకుమారి పర్యటించారు. యాసంగి పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. వేరుశనగ పంటలను పరిశీలించి సస్యరక్షణ చర్యలను వివరించారు. వేరుశనగలో ఆకుమచ్చ తెగులు, పోషక లోపాలు గమనించి నివారణోపాయాలను వివరించారు. ఏఈవో శివతేజ, మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, నల్లబోతుల జంగయ్య, రైతులు కృష్ణయ్య, మహేశ్ తదితులు పాల్గొన్నారు.

అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపన పురస్కరించుకుని ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో పండుగ వాతావరణం నెలకొంది. వాడవాడలా భక్తిశ్రద్ధలతో అట్టహాసంగా వేడుకలు నిర్వహించారు. ఎక్కడ.. ఎవరి నోట విన్నా జై శ్రీరాం నామమే వినిపించింది. కాషాయ జెండాలతో భారీ ర్యాలీలు, శోభాయాత్రలు నిర్వహించారు. శ్రీరామతత్వం ఉట్టి పడేలా ఇళ్ల ముందు ముగ్గులు వేసి శ్రీ బాల రాముడిని ఆహ్వానిస్తూ దీపాలు వెలిగించారు. సామూహికంగా నిర్వహించిన దీపోత్సవాలతో దేవాలయాలు దేదీప్యమానంగా కాంతులీనుతూ కనిపించాయి. ఈ అపురూప ఘట్టం గుర్తుండిపోయేలా రాత్రివేళల్లో బాణాసంచా, టపాసులు కాల్చి దీపావళిని గుర్తు చేసుకుంటూ వేడుక చేసుకున్నారు.


శంకర్‌పల్లిలో శోభాయాత్ర

సర్వం.. రామనామం!

- భారీ స్క్రీన్ల ద్వారా వేడుకలను తిలకించిన భక్తులు
- ప్రత్యేక పూజలు, భజన సంకీర్తనలు, పారాయణాలు
- శోభాయాత్రలు.. అన్నదానం, ప్రసాద వితరణ
- రాత్రి వేళలో ఇళ్ల ముంగిట దీపాలు వెలిగించి స్వాగతం పలికిన మహిళలు
- దీపోత్సవాలతో కాంతులీనిన దేవాలయాలు
- ముచ్చింతల్‌లో వేడుకలకు హాజరైన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, గవర్నర్లు

అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో వేడుకలు


జాపాలలోని ఆలయంలో వీక్షిస్తున్న భక్తులు

ఇంటింటా దీపోత్సవం

అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని ఉమ్మడి జిల్లాలో తమ ఇళ్ల ముందు సోమవారం సాయంత్రం మహిళలు ఐదు దీపాలు వెలిగించారు. శ్రీరామతత్వం ఉట్టి పడేలా ఇళ్ల ముందు ముగ్గులు వేసి శ్రీ బాల రాముడిని ఆహ్వానిస్తూ రామ జ్యోతులను వెలిగించారు. దేవాలయాల్లో సామూహికంగా నిర్వహించిన దీపోత్సవాలతో దేవాలయాలు దేదీప్యమానంగా కాంతులీనుతూ కనిపించాయి. ఈ అపురూప ఘట్టం గుర్తుండిపోయేలా రాత్రివేళలో బాణాసంచా, టపాసులు కాల్చి దీపావళిని గుర్తు చేసుకుంటూ వేడుకలు చేసుకున్నారు.

రంగారెడ్డి అర్బన్, జనవరి22 : అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకుని సోమవారం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా వేడుకలు అంబరాన్నంటాయి. గ్రామాలు, పట్టణాల్లోని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శైవ, వైష్ణవాలయాలతో పాటు ఆంజనేయస్వామి తదితర దేవాలయాల్లో శ్రీ సీతారాములఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భద్రపరిచిన శ్రీరాముడి అక్షింతలకు పూజలు చేసి భక్తులను ఆశీర్వదించారు. ఎవరు కలిసినా, ఎవరితో మాట్లాడినా జైశ్రీరాం అన్న మాటనే వినిపించింది. రంగారెడ్డి జిల్లాలోని ఆలయాల్లో సామూహిక శ్రీరామ సంకీర్తనలు, భజనలు చేశారు. బాలరాముడి చిత్రపటాలు, కాషాయ జెండాలను చేతబట్టుకుని భారీగా ర్యాలీలు నిర్వహించారు. ముచ్చింతల స్వర్ణభారత్ ట్రస్టులో సోమవారం శ్రీ సీతారాముల కల్యాణోత్సవం జరిగింది. ఈ ఉత్సవంలో భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, మిజోరాం గవర్నర్ హరిబాబులు పూజలు నిర్వహించారు. చిలుకూరు బాలాజీ దేవాలయం నుంచి చిలుకూరు గ్రామంలోని అంజనేయస్వామి దేవాలయం వరకు రంగరాజన్ పంతులు అధ్వర్యంలో ప్రత్యేక ఊరేగింపు, ర్యాలీ చేపట్టారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, ఎంపీ రంజిత్‌రెడ్డి చేవెళ్లలోని హనుమాన్ టెంపుల్, సీతారాంపూర్‌లోని సీతారామాలయంలో నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. షాబాద్‌లో రామాలయం నుంచి మల్కాబావి శ్రీ ఆంజనేయస్వామి అలయం వరకు శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. షాద్‌నగర్‌లోని చౌడమ్మగుట్ట ఆంజనేయస్వామి దేవాలయం, నందిగామ మండలం చేగూరులోని రామాలయంలో పల్లకీ సేవ, ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొన్నారు. స్థానిక మలయాళ స్వామి ఆశ్రమంలో ప్రత్యేక పూజలో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు పాల్గొన్నారు. కేశంపేట మండలం, ఫరూఖ్‌నగర్ మండలం, మధురాపూర్, మొగిలిగిద్ద, చించోడు, దేవునిపల్లి, కందివనం, వెలిజర్ల తదితర గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించారు. హిందూ సంఘాల ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలో ర్యాలీ నిర్వహించారు. మంచాల, యాచారం, మాల్, గడ్డమల్లాయగూడ, చౌదర్‌పల్లిలలో పూజలు నిర్వహించారు. నల్లవెల్లి గుట్టలోని సీతారామచంద్రస్వామికి ఇన్‌స్పెక్టర్ సైదయ్య గ్రామస్తులతో కలిసి పూజలు చేశారు. ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి మండలాల పరిధిలోని దేవాలయాల్లో పూజలు, అభిషేకాలు చేపట్టారు. కడ్తాల చెన్నకేశవ స్వామి దేవాలయ ఆవరణలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వికారాబాద్ జిల్లా కేంద్రంలో శ్రీరామ మందిరం వేలాదిమంది భక్తులతో కిక్కిరిసి పోయింది. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన భారీ స్క్రీన్‌పైన బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠాపనను వీక్షించారు

శ్రీ రామ... జయజయ రామ

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా రామ నామస్మరణతో మార్మోగింది. హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో జిల్లాలో పలు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. ఇళ్ల ముందు అందంగా ముగ్గులు వేసి పచ్చని తోరణాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ఆలయాల వద్ద అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు చేపట్టారు. యువకులు జై శ్రీరామ్ అంటూ బైక్ ర్యాలీలు నిర్వహించారు. శామీర్‌పేటలో శోభాయాత్ర, స్వామివారి కల్యాణం నిర్వహించారు.

బాలరాముల జననం

బాలరాముడి ప్రాణప్రతిష్ఠ రోజు పండంటి శిశువుల జననం


వికారాబాద్, మోమిన్‌పేటలో మగశిశువుల జననం

వికారాబాద్/మోమిన్‌పేట, జనవరి 22 : అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకుని సోమవారం దేశం మొత్తం శ్రీరామ నామస్మరణతో మార్మోగింది. అయితే ఇదే రోజు రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం ఎత్‌బార్ పల్లి గ్రామానికి చెందిన విజయ్,సుప్రియ దంపతులు. వికారాబాద్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో సుప్రియ పండంటి మగ శిశువుకు జన్మనించింది.మా ఇంట బాలరాముడు జన్మించాడని కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. రామచంద్రుడి పేరు వచ్చే విధంగా నామకరణం చేస్తామని తెలిపారు. ఇదిలా ఉండగా, మోమిన్‌పేట్ మండలం టేకులపల్లి గ్రామానికి చెందిన జంగంశ్రావణి, ప్రవీణ్‌కుమార్ దంపతులకు పండంటి మగశిశువు జన్మినించడంతో సంతోషం వ్యక్తం చేశారు. ఈ మధురక్షణం ఎప్పటికీ మరచిపోలేమని ఆనందం వ్యక్తం చేశారు.


ఆమనగల్లులో హారతి ఇస్తున్న మహిళలు


కేశంపేట హనుమాన్ ఆలయంలో అన్నదానం

ముదిరి పాకాన..

'పట్నం' మున్సిపాలిటీలో 'అవిశ్వాస' వ్యవహారం


మున్సిపల్ చైర్‌పర్సన్ స్రవంతి

- గతంలో అవిశ్వాసం ప్రకటించిన సొంత పార్టీ కౌన్సిలర్లు.. నేడు ప్రత్యర్థి పార్టీలు
- గోవాలో విడిది.. అధికారుల నిర్ణయం కోసం ఎదురుచూపులు

ఇబ్రహీంపట్నం, జనవరి 22 : ఇబ్రహీంపట్నం మున్సిపల్ వ్యవహారం ముదిరి పాకాన పడింది. మున్సిపల్ చైర్‌పర్సన్ స్రవంతిపై అవిశ్వాసం ప్రకటించిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు గోవాలో విడిదిచేసి అధికారుల నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నారు. ఇక్కడ మొత్తం 24 మంది కౌన్సిలర్లకుగాను 17 మంది అవిశ్వాస తీర్మానంపై సంతకాలు చేసి ఈ నెల 8న జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌ను కలిసి నోటీసు అందజేశారు. వీరిలో బీఆర్ఎస్‌కు చెందిన మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆకుల యాదగిరి సహా 15మంది, ఇద్దరు బీజేపీ కౌన్సిలర్లు ఉన్నారు. బీఆర్ఎస్ నుంచి ఎన్నికై చైర్‌పర్సన్ పీఠాన్ని అధిష్ఠించిన స్రవంతిని ముందునుంచీ వివాదాలు చుట్టుముట్టాయి. అప్పట్లో కౌన్సిల్‌లో బీఆర్ఎస్‌కు 16, కాంగ్రెస్‌కు 6, బీజేపీకి ఇద్దరు కౌన్సిలర్లు ఉన్నారు. మొదటిసారి గతేడాది మేలో చైర్‌పర్సన్ స్రవంతి అవినీతికి పాల్పడ్డారంటూ సొంత పార్టీ కౌన్సిలర్లు 14 మంది (వైస్ చైర్మన్ సహా) తిరుగుబాటు బావుటా ఎగరవేసి అప్పటి జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్, అదనపు కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిలకు ఫిర్యాదు చేశారు. ఎజెండాలోని లేని అంశాలను చేర్చి సుమారు రూ.కోట్ల మేర అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. ఈ విషయమై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. దాంతో గతేడాది మే 28న అదనపు కలెక్టర్ ప్రతీక్‌జైన్ మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులకు సీజ్ చేసి తీసుకెళ్లారు. ఆ తర్వాత మున్సిపల్ చైర్‌పర్సన్‌కు షోకాజ్ నోటీసు కూడా అందింది.



కొన్ని నెలలపాటు కౌన్సిల్ సమావేశాలు కూడా నిర్వహించలేని పరిస్థితి ఏర్పడింది. ఉన్నతాధికారుల సూచన మేరకు మున్సిపల్ కమిషనరే పాలనా వ్యవహారాలను ముందుకు తీసుకెళుతున్నారు. ఆ తర్వాత పరిస్థితి కొంత సద్దుమణిగిందని అనుకుంటుండగానే ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల ముందు చైర్‌పర్సన్ బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. అదేదారిలో మరో ముగ్గురు కౌన్సిలర్లు నీళ్ల భానుబాబు, ఇందిరాల రమేష్, జర్ల మంగలు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. అంతక్రితమే కాంగ్రెస్ కౌన్సిలర్లు పంది శంకరయ్య, మోహన్ నాయక్, నరాల విశాలలు బీఆర్ఎస్‌లో చేరారు. దాంతో కౌన్సిల్‌లో బీఆర్ఎస్‌కు 15, కాంగ్రెస్ 7, బీజేపీకి ఇద్దరు కౌన్సిలర్లు ఉన్నారు. ప్రభుత్వం మారడంతో మరోమారు అవిశ్వాస వ్యవహారం తెరపైకి వచ్చింది. కాగా, అవిశ్వాసంపై అధికారులు గ్రీన్‌సిగ్నల్ ఇస్తే 9వ వార్డు కౌన్సిలర్ కొంద్రు శ్రీలత చైర్‌పర్సన్ పీఠాన్ని అధిష్ఠించడానికి సిద్ధంగా ఉన్నారు.

మగవారితో సమానంగా ఆడ పిల్లలను పెంచాలి

- సమాజంలో ఆడపిల్లలు వివక్షకు గురవుతున్నారు
- కుటుంబ వ్యవస్థలో మార్పు రావాలి, ప్రతీ ఒక్కరు చదువుకోవాలి
- జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్



పోస్టర్ విడుదల చేస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

రంగారెడ్డి అర్బన్, జనవరి 22 : మగపిల్లలతో సమానంగా ఆడ పిల్లలను పెంచాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. ఈ నెల 24వ తేదీన జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. సమావేశంలో జ్యోతి ప్రజ్వలన అనంతరం బేటీ బచావో.. బేటీ పడావో క్యాలెండర్, కెరీయర్ గైడెన్స్ పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతర అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఆడపిల్లలను రక్షించడం, చదివించడం వల్ల సమాజంలో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని అన్నారు. ఆడ, మగ అనే తేడాలు పిలిచే పిలుపులో ఉండాలి తప్ప చూపించే ప్రేమలో ఉండకూడదన్నారు. ఈ జాడ్యాన్ని రూపుమాపాలంటే ముందు కుటుంబ వ్యవస్థలో మార్పు రావాలన్నారు. అమ్మాయిలు ధైర్యంగా సమస్యలను ఎదుర్కొని, బాగా చదువుకొని ఉన్నతస్థాయిలో ఉండాలని ఆకాంక్షించారు. పాఠశాలలలో విద్యార్థి, విద్యార్థినిలకు చట్టాలపై అవగాహన, ప్రతి అంశంపై చర్చించే విధంగా శిక్షణ ఇవ్వాలని డీఈఓకు సూచించారు. బాల్య వివాహాలను అరికట్టాలని సూచించారు. అనంతరం అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ బాలికలు సమాజానికి మణిహారం.. బాలికలకు రక్షణ కల్పిద్దాం.. వారి బంగారు భవితకు పునాది వేద్దాం. బాలికలను బ్రతకనిద్దాం, చదవనిద్దాం అని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సమావేశంలో సీడబ్ల్యూసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి సుశీందర్‌రావు, జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, జిల్లా శిశు సంక్షేమాధికారి పద్మజ రమణ, సివిల్ సప్లయ్ డీఎం విజయలక్ష్మీ, సూపర్‌వైజర్లు, చైల్డ్ లైన్ కోర్డినేటర్లు, బాలల సంరక్షణ కేంద్రాల నిర్వాహకులు,తదితరులు పాల్గొన్నారు.

'ప్రజావాణి'కి అధికారులు హాజరు కావాల్సిందే

ప్రజావాణికి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాల్సిందేనని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. బాధితుల నుంచి 40 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజావాణిలో స్వీకరించే ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సత్వరమే స్పందించి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లా అధికారులు, కలెక్టరేట్ పర్యవేక్షకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



ఎప్పుడిస్తారో!

నాలుగు నెలలుగా మోడల్ కళాశాలల హాస్టల్ సిబ్బందికి అందని జీతాలు

- ఆర్థిక ఇబ్బందుల్లో వార్డెన్లు, వంట నిర్వాహకులు, ఏఎన్ఎంలు
- సకాలంలో జీతాలు రాక ఉద్యోగం మానేసుకుంటున్న సిబ్బంది

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, జనవరి 22 : నెలనెలా వేతనం వస్తేనే కుటుంబం గడిచేది... అలాంటిది నెలల కొద్దీ రాకుంటే ఎలా అని మోడల్ కాలేజీల హాస్టల్ సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. జీతాల కోసం ఎదురు చూస్తున్నారు. జీతాలు సకాలంలో అందక కొందరు ఉద్యోగం మానేస్తున్నారు. త్వరగా జీతాలు ఇవ్వాలని కోరుతూ జిల్లా, రాష్ట్రస్థాయి అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలో మొత్తం 15 మోడల్ స్కూళ్లు ఉన్నాయి. మోడల్ కాలేజీల్లో చదువుకుంటున్న ఇంటర్ విద్యార్థినులకు ప్రభుత్వం వసతి గృహాలను ఏర్పాటు చేసింది. ఒక్కో మోడల్‌స్కూల్ కళాశాల హాస్టల్‌లో వందమంది విద్యార్థినులు ఉంటున్నారు. రంగారెడ్డి జిల్లాలో చేవెళ్ల, షాబాద్, ఇబ్రహీంపట్నం పరిధిలోని బొంగ్లూరు, శంషాబాద్ మండలంలోని పాల్మాకుల, యాచారం పరిధిలోని గున్‌గల్, మహేశ్వరం, మంచాల పరిధిలోని ఆరుట్ల, కందుకూరు, శంకర్‌పల్లిలో మోడల్ స్కూల్స్ కొనసాగుతున్నాయి. శంకర్‌పల్లి మినహా అన్ని మండలాల్లో ఇంటర్ విద్యార్థినులకు హాస్టల్ సౌకర్యం కల్పించారు. అలాగే వికారాబాద్ జిల్లాలో పూడూరు మండలం ఎన్కేపల్లి, తాండూరులోని జినుగుర్తి, పరిగిలోని జాఫర్‌పల్లి, కుల్కచర్ల పరిధిలోని ముజాయత్‌పూర్, నవాబుపేట, మర్పల్లిలో మోడల్ స్కూల్స్‌లో ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఒక్కో మోడల్ స్కూల్ ఇంటర్ విద్యార్థినుల హాస్టల్‌లో కేర్‌టేకర్ ఉంటారు. వారికి నెలకు రూ. 12,500 చొప్పున నాలుగు నెలల వేతనం రావాల్సి ఉంది. అలాగే వాచ్‌మన్‌కు రూ.8,710, ఏఎన్ఎంకు రూ.7,800, హెడ్‌కుక్‌కు రూ.7,800, ఇద్దరు అసిస్టెంట్ కుక్కులు ఒక్కొక్కరికి రూ.6,500 చొప్పున నాలుగు నెలలకు సంబంధించి వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. మోడల్ స్కూల్ హాస్టళ్ల నిర్వహణ బాధ్యతలను కేజీబీవీ ఎస్‌వోలు చూస్తున్నారు. ఎస్‌వోకు నెలకు రూ.2,500 చెల్లిస్తున్నారు. అయితే, సకాలంలో వేతనాలు రాకపోవడంతో ఇటీవలే షాబాద్ మోడల్ స్కూల్ హాస్టల్‌లో ఏఎన్ఎం ఉద్యోగం మానేసినట్లు తెలిసింది.





ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం

చాలీ చాలని వేతనాలు కూడా సకాలంలో రాక పోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. నాలుగు నెలలుగా జీతాలు పెండింగ్‌లో ఉన్నాయి. త్వరగా జీతాలు ఇవ్వాలని కోరుతూ స్కూల్ ఎడ్యుకేషన్ కమిషన్, జిల్లా విద్యాధికారికి విన్నవించాం. త్వరగా జీతాలు ఇవ్వాలి.

- శాంతి, కేర్‌టేకర్, పాల్మాకుల మోడల్ హాస్టల్, శంషాబాద్ మండలం



భారంగా కుటుంబ పోషణ

నాలుగు నెలల నుంచి జీతాలు లేవు. సంక్రాంతి పండగ కూడా చేసుకోలేము. జీతాల కోసం నెలల తరబడి ఎదురు చూస్తున్నాము. వచ్చే చాలీ చాలని జీతంతో కుటుంబాన్ని పోషిస్తున్నాం. అవి కూడా సకాలంలో ఇవ్వడం లేదు.

- లావణ్య, వంట మనిషి, చేవెళ్ల మోడల్ స్కూల్ హాస్టల్

జీతాల కోసం డీఈవోను కలుస్తాం

జీతాల కోసం డీఈవోను కలిసేందుకు సిద్ధమవుతున్నాం. సకాలంలో జీతాలు రాకపోవడంతో వర్కర్లు పని మానేస్తున్నారు. ఇప్పటికే మా హాస్టల్లో కుక్ మానేసింది. రోజువారి కూలీ ఇచ్చి వేరే వంటమనిషితో భోజనం వడ్డించి పిల్లలకు పెడుతున్నాం.

-నాగమణి, కేర్‌టేకర్, నవాబుపేట మోడల్ స్కూల్ హాస్టల్


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శశాంక

గణతంత్ర వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు

- జిల్లా కలెక్టర్ శశాంక

రంగారెడ్డి అర్బన్, జనవరి 22 : గణతంత్ర వేడుకల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఆయన సోమవారం అన్ని శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశాన్ని నిర్వహించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి ఆయా శాఖల వారీగా అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎలాంటి లోటుపాట్లకూ తావులేకుండా అట్టహాసంగా వేడుకలు జరిగేలా ఆయా శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వివిధ వర్గాల వారి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా సమగ్ర వివరాలతో జిల్లా ప్రగతి నివేదిక రూపొందించాలని సంబంధిత అధికారిని ఆదేశించారు. కార్యక్రమానికి కలెక్టరేట్‌లోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది తప్పక హాజరు కావాలని ఆదేశించారు. ఉత్తమ ఉద్యోగుల ఎంపిక కోసం శాఖల వారీగా ప్రతిపాదనలను ఈ నెల 24వ తేదీ సాయంత్రం లోపు వారి పేర్లను సిఫారసు చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, కలెక్టరేట్ ఏఓ ప్రమీలారాణి, వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కోడిగుడ్లు విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు

కులకచర్ల, జనవరి 22: అంగన్‌వాడీ కోడిగుడ్లను బహిరంగంగా మార్కెట్‌లో విక్రయించిన మండలంలోని మందిపాల్ గ్రామానికి చెందిన పెంటయ్యపై కేసు నమోదు చేసినట్లు మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి లలితకుమార్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. చౌడాపూర్‌లో ఆదివారం రూ.5కే అంగన్‌వాడీ కోడిగడ్లను మందిపాల్ వెంకటయ్య బహిరంగ మార్కెట్‌లో విక్రయించాడు. దీంతో అతన్ని గ్రామస్తులు పట్టుకొని తహసీల్దార్‌కు అప్పగించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ అంజమ్మ ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి కోడిగుడ్లను స్వాధీనం చేసుకుని మందిపాల్ పెంటయ్యపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అయితే పట్టుబడిన కోడిగుడ్లు వికారాబాద్‌కు సంబంధించినవి కావని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

రేపు హార్టికల్చర్ యూనివర్సిటీ బృందం పర్యటన

వికారాబాద్, జనవరి 22: శ్రీ కొండా లక్ష్మణ్ హార్టికల్చర్ యూనివర్సిటీ వైస్‌ఛాన్స్‌లర్ నీరజ ప్రభాకర్, బృందం పూడూరులో బుధవారం(రేపు) పర్యటించనున్నట్లు ఉద్యానవన, పట్టు పరిశ్రమల శాఖ అధికారి చక్రపాణి ఒక ప్రకటన తెలిపారు. స్థానిక ఆర్చిడ్ పాలిహౌస్‌ను, మామిడి తోట, వికారాబాద్ హార్టికల్చర్ ఫార్మ్‌ను క్షేత్రస్థాయిలో సందర్శిస్తారని, మధ్యాహ్నం 2 గంటలకు కలెక్టరేట్‌లో రైతులకు శిక్షణ ఉంటుందన్నారు.

కేంద్రం నుంచి నిధులు రాబట్టేందుకు కృషి చేస్తా

● ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేకప్రతినిధి మల్లు రవి


మల్లు రవిని సన్మానిస్తున్న కేశవులు

ఆమనగల్లు , జనవరి 22: కేంద్రప్రభుత్వం నుంచి రాష్ట్రానికి రావాల్సిన వాటా నిధులను రాబట్టేందుకు తన వంతు కృషి చేస్తానని ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేకప్రతినిధి డాక్టర్ మల్లు రవి అన్నారు. పట్టణానికి చెందిన పలువురు నాయకులు సోమవారం ఆమనగల్లు మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ గుర్రం కేశవులు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ వస్పుల జంగయ్య ఆధ్వర్యంలో మల్లురవిని హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా ఆయనను కలిశారు. ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేకప్రతినిధిగా నియామకమైన సందర్భంగా శాలువాలతో సత్కరించి అభినందించారు. రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చూడాలని ఈ సందర్భంగా రవి వారికి సూచించారు. నాయకులు ఇమ్రాన్‌బాబా, ఫరీద్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

కోర్టు ఆదేశాలతో ఆలయ భూములు స్వాధీనం


ఆలయ భూమిలో బోర్డు ఏర్పాటు చేస్తున్న అధికారులు

షాద్‌నగర్ రూరల్, జనవరి 22 : ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద శివారులోని శ్రీరంగనాయక స్వామి ఆలయానికి చెందిన భూములను కోర్టు ఉత్తర్వులమేరకు దేవాదాయ శాఖ అధికారులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. దేవాదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ టి. శేఖర్ కథనం ప్రకారం రంగస్వామి ఆలయానికి షాబాద్ మండలం మన్‌మర్రి గ్రామ శివారులో సర్వేనెంబరు 280-1లో 4ఎకరాల 38 గుంటలు, 280-2లో 5 గుంటల భూమి ఉండగా దాన్ని పలువురు రైతులు సాగు చేసుకుంటున్నారు. ఆలయానికి చెందిన భూమి కోసం అధికారులు దేవాదాయశాఖ ట్రిబ్యూనల్ కోర్టును ఆశ్రయించారు. రెండు నెలల కింద దేవాదాయశాఖకు అనుకూలంగా తీర్పు రావడంతో రైతులు హైకోర్టుకు వెళ్లారు. అక్కడ కూడా దేవాదాయశాఖకు అనుకూలంగా తీర్పు రావడంతో సదరు భూముల్లో బోర్డులు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో పరిశీలకుడు మధుబాబు, ఈఓలు శివకుమార్, ప్రవీణ్, గణేష్, చంద్రమోహన్, నరేందర్ తదితరులు ఉన్నారు.

బాల రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సంతోషకరం

● మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు
● స్వర్ణభారత్ ట్రస్టులో ఘనంగా రాములోరి కల్యాణోత్సవం
● పాల్గొన్న హర్యానా, మిజోరాం గవర్నర్లు


సీతారాముల కల్యాణంలో పాల్గొన్న వెంకయ్యనాయుడు, హర్యానా, మిజోరాం గవర్నర్లు బండారు దత్తాత్రేయ, కె.హరిబాబు

శంషాబాద్, జనవరి 22(ఆంధ్రజ్యోతి) : బాల రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సంతోషకరమని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండల పరిధి ముచ్చింతల్‌లోని స్వర్ణభారత్ ట్రస్టులో సోమవారం రాములోరి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. వెంకయ్యనాయుడుతో పాటు హర్యానా, మిజోరాం గవర్నర్లు బండారు దత్తాత్రేయ, కె.హరిబాబులు పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ అయోధ్యలోని రామ మందిరంలో బాల రాముడి విగ్రహం ప్రాణప్రతిష్ఠాపన చేయడానికి 500 సంవత్సరాలు వేచి చూశామని అన్నారు. ఆ కోరిక ఈరోజు నెరవేరిందని ఆయన తెలిపారు. విగ్రహం ప్రతిష్ఠించుకోవడం చాలా సంతోషాన్ని కలిగించిందన్నారు. దేశవ్యాప్తంగా ప్రతీ ఊరు, ప్రతీ పల్లె శ్రీరామ నామ స్మరణతో మార్మోగిపోయిందన్నారు. అయోధ్యలో రామమందిరం నిర్మించాలన్నది దేశంలోని హిందువుల చిరకాల కోరిక అని, అది నేడు నెరవేరడం చాలా ఆనందాన్ని కలిగించిందన్నారు. కేవలం భారత్‌లోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా శ్రీరాముడి పేరును స్మరించుకుంటున్నారని అన్నారు. శ్రీరాముడు గతంలో సాగించిన పరిపాలనను గుర్తుచేసుకుంటూ మళ్లీ రామరాజ్యం రావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని తెలిపారు. అయోధ్యలోని రామమందిరంలో జరిగిన బాల రాముడి విగ్రహ ప్రాణపతిష్ఠ ప్రధాని నరేంద్రమోదీ చేతుల మీదుగా జరగడం చాలా సంతోషాన్నిచ్చిందని అన్నారు. సమాజంలో ప్రజలందరూ కలసిమెలసి ఉండి అవినీతి అనేది లేకుండా చేయాలని ఆయన ప్రజలను కోరారు.

ఖేలో ఇండియా ఉమెన్స్ కిక్ బాక్సింగ్‌లో జిల్లా విద్యార్థులకు మెడల్స్

●అభినందించిన జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి


విద్యార్థులకు మెడల్స్ అందజేస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, జనవరి 22 : జాతీయస్థాయి ఖేలో ఇండియా ఉమెన్స్ కిక్ బాక్సింగ్ పోటీలలో జిల్లా విద్యార్థులు మెడల్స్ సాధించారని జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో వారికి మెడల్స్ సర్టిఫికేట్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేజీబీవీ బొంరాస్‌పేట్‌కు చెందిన ఏ వైష్ణవి గోల్డ్ మెడల్, పీ.నందిని సిల్వర్ మెడల్, ఎస్. నవిత సిల్వర్ మెడల్, ఎన్ నందిని బ్రోన్జ్ మెడల్స్‌ను సాధించారని చెప్పారు. ఈనెల 20, 21 హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో జరిగిన పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సందర్భంగా వారిని కలెక్టర్, అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకదేవి అభినందించారు. కేజీబీవీ ఎస్వో రాధిక, కోచ్ సాయిలును అభినందించారు.

గ్యాస్ సరఫరాలో ఇబ్బంది కలగకుండా చూడాలి

●జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్


గోదాం వద్ద గ్యాస్ నిర్వాహకులతో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, జనవరి 22 : గ్యాస్ సరఫరా విషయంలో ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని జిల్లా అదనపుకలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. సోమవారం పట్టణంలోని అంబికా ఏజెన్సీ కార్యాలయం, గోదాంను పరిశీలించారు. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఆదేశాల మేరకు అదనపుకలెక్టర్‌తో పాటు సివిల్ సప్లయ్ అధికారి రాజేశ్వర్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి వెళ్లి పరిశీలించి ఏజెన్సీ నిర్వాహకులతో మాట్లాడారు. గ్యాస్ ఏజెన్సీ వారి నిర్లక్ష్యం వల్లే గ్యాస్ కొరత ఏర్పడిందని కలెక్టర్ దృష్టికి విషయం తీసుకెళ్లడం జరిగిందని సుధాకర్ రెడ్డి అన్నారు. కొందరు కావాలనే ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని, ఈ విషయంలో ప్రభుత్వానికి సంబంధం లేదని డీలర్ నిర్లక్ష్యం వల్లే సమస్య తలెత్తినట్లు చెప్పారు.

ఇంటర్మీడియట్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

●అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

మేడ్చల్ జనవరి 22 : ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా పగడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా అదనపుకలెక్టర్ విజయేందర్‌రెడ్డి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఫిబ్రవరి 28 నుండి మార్చి 19 వరకు పరీక్షలు జరుగబోతుండడంతో సోమవారం సంబంధిత అధికారులు, సిబ్బందితో ముందస్తు ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల్లో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు 65,965, ద్వితీయ సంవత్సరం చదువుతున్న 65495 మంది పరీక్షలకు హాజరవుతారు. జిల్లా వ్యాప్తంగా 140 పరీక్షా కేంద్రాలు ఉన్నాయని, 4 ప్రభుత్వ, 136 ప్రయివేటు, అన్‌ఎయిడెడ్ జూనియర్ కాలేజీలను పరీక్ష కేంద్రాల కోసం ఎంపిక చేసినట్లు తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ఎం.కిషన్, డీఈఓ విజయకుమారి, అధికారులు పాల్గొన్నారు.

పల్లెప్రగతితో సత్ఫలితాలు సాధించాం

●మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి


కందుకూరు: అన్నోజిగూడలో పంచాయతీ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి

కందుకూరు, జనవరి 22 : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన పల్లెప్రగతితో సత్ఫలితాలను సాధించామని, దానిలో గ్రామపంచాయతీ పాలకవర్గం సభ్యులు, ప్రభుత్వఅధికారుల కృషి అభినందనీయమని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. మండలంలోని అన్నోజిగూడలో నిర్మించిన గ్రామపంచాయతీ నూతన భవనాన్ని సర్పంచ్ కాకి ఇందిరదశరథ, జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డితో కలిసి సోమవారం ప్రారంభించి, అంగన్‌వాడీ కేంద్రానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో 20 గ్రామాలలో కొత్తగా గ్రామ పంచాయతీ భవనాలను నిర్మించినట్లు, రూ.30లక్షల నిధులతో అన్నోజీగూడలో అన్ని అంగులతో పంచాయతీ భవనాన్ని నిర్మించినట్లు చెప్పారు. మారుమూల గ్రామాలను కూడా మాజీ సీఎం కేసీఆర్ సహకారంతో అభివృద్ధి చేశామన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతుబంధును ప్రవేశపెట్టారన్నారు. కొత్త ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, రైతుబంధు డబ్బులను రైతుల ఖాతాల్లోకి వెంటనే పూర్తిస్థాయిలో జమచేయాలని కోరారు. జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి వైఎస్ఎంపీపీ గంగుల శమంతప్రభాకర్ రెడ్డి,ఏఎంసీ చైర్మన్ ఎస్ సురేందర్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ డి.చంద్రశేఖర్, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ఎస్ రాజశేఖర్‌రెడ్డి, సర్పంచ్‌లు బి.నరేంగౌడ్, మంద సాయిలు, ఎంపీటీసీలు ఇందిరదేవేందర్, కాకి రాములు, నాయకులు కాకి దశరథ, మన్నె జయేందర్‌ముదిరాజ్, జి.లక్ష్మినర్సింహారెడ్డి, రఘురాంరాథోడ్, కృష్ణ పాల్గొన్నారు.

అక్రమార్కులపై ఉక్కుపాదం

● అనుమతి లేని వ్యాపారాలకు చెక్
● భూకబ్జాలపై విచారణ


తాండూరు హైదరాబాద్ రోడ్డులో సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు

తాండూరు, జనవరి 22 : పదేళ్లుగా తాండూరులో జోరుగా సాగుతున్న అక్రమ వ్యాపారానికి స్థానిక ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి చెక్ పెట్టించారు. కాగ్నా, కాక్రమేణి నదుల నుంచి సాగే అనుమతి లేని ఇసుక రవాణాను అరికట్టి రూ. 600లకే ట్రాక్టర్ ఇసుక లభించే విధంగా ఇసుక పాలసీని తీసుకువచ్చారు. ఎంపిక చేసిన ప్రాంతాల్లో డీడీ చెల్లించిన వారికే అనుమతులు ఇస్తున్నారు. మైనింగ్ అనుమతులు లేకుండా సుద్ద వ్యాపారం, నాపరాయి తవ్వకాలు నిర్వహిస్తున్న వారికి నోటీసులు జారీ చేయించారు. దాడులు నిర్వహించి చర్యలు తీసుకునేలా చేశారు. అధికారపార్టీ నేతలకు కూడా జరిమానాలు, నోటీసులు రావడంతో ఎమ్మెల్యే తీరుపై సొంతపార్టీ వారే లబోదిబోమంటున్నారు. ఇదిలా ఉండగా భూకబ్జాలపై రెవెన్యూ శాఖను అప్రమత్తం చేశారు. కబ్జా ఆరోపణలు వచ్చిన స్థలాలను గుర్తించాలని కలెక్టర్‌ను ఎమ్మెల్యే కోరారు, తాండూరు హైదరాబాద్ రోడ్డు మార్గంలో ఎంఐఎం అధ్యక్షుడు హది నాలా స్థలం కబ్జా చేశారనే ఆరోపణలు రావడంతో రీ సర్వే చేయాలని యాలాల మండల రెవెన్యూ అధికారులను ఆదేశించడంతో సర్వే మొదలుపెట్టారు. తమ నాయకులను బెదిరిస్తే ఊరుకోబోమని హైదరాబాద్ ఎంపి, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసి తాండూరులో ఇటీవల హెచ్చరించిన విషయం విధితమే. తాండూరులో జరిగిన మరిన్న భూకబ్జాలు, , స్థలాల క్రమబద్ధీకరణ, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో గతంలో జరిగిన అక్రమాలు విచారణ జరిపించాలని నిర్ణయించారు.

బఫర్‌జోన్‌లో అనుమతి లేని నిర్మాణాలు

● పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు
● చెరువుల ఉనికికే ప్రమాదమంటున్న నిపుణులు


వెంకటాపూర్ నాడెంచెరువు బఫర్‌జోన్‌లో నిర్మాణాలు చేపడుతున్న దృశ్యం

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 22 : చెరువులను, కుంటలు, కాలువలను కాపాడాలని ప్రభుత్వం చెబుతున్నా అది సాధ్యం కావడం లేదు. అక్రమార్కులు ఇష్టానుసారంగా బఫర్‌జోన్లను ఆక్రమిస్తున్నా ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదు. మండలంలోని వెంకటాపూర్ నాడెంచెరువు, ఎదులాబాద్‌లోని లక్ష్మినారాయణ చెరువుల బఫర్‌జోన్లను ఆక్రమించి పలువురు ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపడుతూ, ప్రహరీలను నిర్మిస్తున్నా అధికారులు అటువైపు కన్నెతి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది. బఫర్‌జోన్‌లు ఆక్రమణలకు గురికాకుండ అక్రమార్కులపై తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఆక్రమణల వల్ల చెరువుల విస్తీర్ణం తగ్గి ఉనికికే ప్రమాదం వాటిల్లుతుందని నిపుణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బఫర్‌లో నిర్మాణాలను కూల్చివేస్తాం




వెంకటాపూర్ నాడెం చెరువు, ఎదులాబాద్ లక్ష్మినారాయణ చెరువు బఫర్‌లో నిర్మాణాల విషయం మా దృష్టికి వచ్చింది. త్వరలోనే వాటిని కూల్చివేస్తాం. చెరువుల స్థలాలను ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు పెడుతాం. సెలవు రోజులలో నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిసింది. బఫర్‌లను ఆక్రమిస్తే ఎంతటివారినైనా వదిలిపెట్టేది లేదు.

అరిగే పరమేష్, ఇరిగేషన్ ఏఈ ఘట్‌కేసర్ మండలం

అంగన్‌వాడీ కోడిగుడ్లు విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

కులకచర్ల, జనవరి 22 : చౌడాపూర్‌లో అంగన్‌వాడీ కోడిగుడ్లను బహిరంగంగా మార్కెట్‌లో విక్రయించిన మందిపాల్ గ్రామానికి చెందిన పెంటయ్యపై ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసినట్లు మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి లలితకుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం చౌడాపూర్‌లో రూ.5కే అంగన్‌వాడీ కోడిగడ్లను బహిరంగ మార్కెట్‌లో మందిపాల్ వెంకటయ్య విక్రయించగా గ్రామస్థులు పట్టుకొని తహసీల్దార్‌కు అప్పగించిన విషయం తెలిసిందే. ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ అంజమ్మ ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేసి పట్టుబడిన కోడిగుడ్లను స్వాధీనం చేసుకొని నిందితుడిపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఆమె చెప్పారు. ఆ కోడిగుడ్లు వికారాబాద్ జిల్లాకు చెందినవి కావని తెలిపారు.

మ్యాథమేటిక్స్ టెస్ట్‌లో మెరిసిన ఆదర్శ పాఠశాల విద్యార్థి


జిల్లా స్థాయి మ్యాథమేటిక్స్ టాలెంట్ టెస్ట్‌లో ఫస్ట్ ర్యాంకు సాధించిన విద్యార్థి విద్యా సాగర్

ఆదిభట్ల, జనవరి 22 : జిల్లాస్థాయి మ్యాథమేటిక్స్ టాలెంట్ టెస్ట్‌లో బొంగ్లూరు ఆదర్శ పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థి విద్యా సాగర్ ప్రతిభ చూపి ప్రథమస్థానంలో నిలిచాడని ప్రిన్సిపాల్ లావణ్య తెలిపారు. సోమవారం విద్యాసాగర్‌ను ఉపాధ్యాయ బృందం తో కలిసి ఆమె అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హయాత్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ గణిత ఫోరం ఆధ్వర్యంలో సోమవారం జిల్లాస్థాయి మ్యాథమేటిక్స్ టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించగా తమ పాఠశాలకు చెందిన విద్యాసాగర్ ప్రథమస్థానంలో నిలవడంతోపాటు, ఈనెల 29న నిజామాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి టెస్ట్‌కు అర్హత సాధించాడని చెప్పారు.

ఆరేళ్లుగా అలసత్వం

●ప్రారంభం కాని బీటీ రోడ్డు పనులు
●అధికారులు, కాంట్రాక్టరు నిర్లక్ష్యం
● దుమ్ము,ధూళితో అవస్థలు పడుతున్న ప్రజలు


బీటీ వేయాల్సిన రోడ్డు


రోడ్డు పనుల శిలాఫలకం

షాద్‌నగర్‌రూరల్, జనవరి 22 : నిధులు మంజూరై ఆరేళ్లయినా అధికారులు, కాంట్రాక్టరు అలసత్వం వల్ల ఫరూఖ్‌నగర్ మండలం రాయికల్ బూర్గుగడ్డతండా నుంచి కడియాలకుంట తండా వరకు బీటీ రోడ్డు పనులు ప్రారంభం కావడం లేదు. రోడ్డుపై పోసిన కంకర వల్ల దుమ్ము, దూలి లేవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు కోసం 2018లో ఎస్‌డీఎఫ్ నిధులు రూ. కోటి 35 లక్షలు మంజూరు కాగా అదే ఏడాది జూలై 18న నాటి ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాజీమంత్రి మహేందర్‌రెడ్డి, ఎంపీతో కలిసి పనులకు శంకుస్థాపన చేశారు. ఆరేళ్ల గడుస్తున్నా ఇప్పటికీ పనులు మాత్రం ప్రారంభం కాలేదు. కాంట్రాక్టరు పట్ల అధికారులు ఉదాసీనత చూపడంతోనే పనులు ప్రారంభం కాలేదని పలువురు ఆరోపిస్తున్నారు. గత జూన్ తర్వాత పనులు ప్రారంభమవుతాయని అధికారులు చెప్పి ఏడు నెలలు గడిచినప్పటికీ పనులలో ఎటువంటి పురోగతి లేదు.

రోడ్డు పనులు ప్రారంభించాలి



శిలాఫలకం వేసి ఆరేళ్లు దాటినా రోడ్డు పనులు ప్రారంభించడం లేదు. రోడ్డుపై భారీ వాహనాలు వెళ్తుంటే దుమ్ము లేచి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులను ఎన్ని సార్లు కలిసి పనులు మొదలు పెట్టాలని కోరినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా పనులు ప్రారంభించాలి.

శ్రీను నాయక్ , కడియాలకుంటతాండ

ఊరూవాడ రామనామ స్మరణ


యాచారం : మాల్‌లో సీతారామ లక్ష్మణులు, హనుమంతుడి వేషధారణలో విద్యార్థులు


మొయినాబాద్ రూరల్ : చిలుకూరు ఆలయం నుంచి హనుమాన్ దేవాలయం వరకు ర్యాలీగా వెళ్తున్న అర్చకులు రంగరాజన్, తదితరులు


షాద్‌నగర్ : చౌడమ్మగుట్టలో నిర్వహించిన సీతారాముల పల్లకీ సేవలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, తదితరులు

అయోధ్య రాముడి నామస్మరణతో ఊరూవాడ మార్మోగింది. రామమందిర ప్రారంభోత్సవం, బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం పురస్కరించుకొని సోమవారం జిల్లావ్యాప్తంగా ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు. కొన్నిచోట్ల సీతారాముల కల్యాణం జరిపించారు. అంగరంగ వైభవంగా శ్రీరాముడి శోభాయాత్ర నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. బాలరాముడి చిత్రపటాలు, కాషాయ జెండాలు చేబూని ర్యాలీలు నిర్వహించారు. బాల రాముడికి ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు.


చేవెళ్ల : మండల కేంద్రంలో రామయ్య శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు


మొయినాబాద్ : కేతిరెడ్డిపల్లి గ్రామంలో రాములవారి పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు


షాద్‌నగర్ : మళయాల స్వామి వృద్ధాశ్రమంలో పూజలు నిర్వహిస్తున్న బక్కని నర్సింహులు


మాడ్గుల : పూజల్లో పాల్గొన్న భక్తులు


ఇబ్రహీంపట్నం : ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ సంఘాల సభ్యులు


కందుకూరు : మీర్కాన్‌పేటలో రామలింగేశ్వరస్వామి ఆలయంలో అభిషేకంలో పాల్గొన్న గ్రామస్తులు


కొందుర్గు : పూజలు నిర్వహిస్తున్న భక్తులు


తలకొండపల్లి : వెల్జాల్‌లో సీతారాముల కల్యాణం


కొత్తూర్ : ఆంజనేయస్వామి దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న నాయకులు


చేవెళ్ల : పూజలో పాల్గొని మాట్లాడుతున్న ఎంపీ రంజిత్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్యే యాదయ్య


చౌదరిగూడ : తుమ్మలపల్లిలో శ్రీరాముడి చిత్రపటంతో ఊరేగింపు వేడుకలు


కడ్తాల : బాలరాముడి ప్రాణప్రతిష్ఠను వీక్షిస్తున్న ప్రజలు


షాద్‌నగర్ రూరల్ : మధురాపూర్‌లో రాముడి విగ్రహంతో ఊరేగుతున్న గ్రామస్తులు


షాబాద్ : రాములోరి శోభాయాత్రలో పాల్గొన్న గ్రామస్తులు

జీపీ భవన ప్రారంభోత్సవంలో ఇరువర్గాల వాగ్వాదం

- సర్పంచ్, ఎంపీటీసీలను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- భవనం పూర్తికాకున్నా ప్రారంభమా? : ఎమ్మెల్యే వీర్లపల్లి
- పోలీసులతో ఎంపీ, మాజీ ఎమ్మెల్యేల వాగ్వాదం
- కలెక్టర్ వద్దకు గొడవ!.. మరోసారి ప్రారంభానికి ఏర్పాట్లు

కేశంపేట/కొందుర్గు/షాద్‌నగర్, జనవరి 22: గ్రామ పంచాయతీ భవన ప్రారంభోత్సవంలో వివాదం నెలకొనడంతో గ్రామ సర్పంచ్‌తో పాటు, ఎంపీటీసీని పోలీసులు అదుపులోకి తీసుకున్నా సంఘటన కేశంపేట మండలం కొత్తపేటలో చోటుచేసుకుంది. వివరాలలోకి వెలితే మండల పరిధిలోని కొత్తపేటలో జాతీయ ఉపాధిహామీ పథకం కింద గ్రామ పంచాయతీ భవనాన్ని నిర్మించారు. సర్పంచ్ పదవీకాలం దగ్గర పడుతుండడంతో భవనాన్ని సర్పంచ్ కె.నవీన్ కుమార్, ఎంపీటీసీ మల్లేష్ యాదవ్ ప్రారంభించాలనుకున్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎంపీ శ్రీనివాస్‌రెడ్డిలను ఆహ్వానించారు. అయితే, ఎమ్మెల్యే ఈనెల 26 తరువాత సమయం ఇస్తానని చెప్పడంతో, 22న సోమవారం ఎంపీతో గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించేందుకు సర్పంచ్, ఎంపీటీసీ సన్నాహాలు చేశారు. గ్రామ పంచాయతీ భవన ప్రారంభంలో ప్రొటోకాల్ వివాదం చెలరేగే అవకాశం ఉందని పంచాయతీరాజ్ ఏఈ భూపాల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఏఈ సమాచారంతో సర్పంచ్, ఎంపీటీసీలను పోలీసులు అదుపులోకి తీసుకుని కొందుర్గు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

మూడు గంటల పాటు ఉద్రిక్తత

కొత్తపేట జీపీ భవన ప్రారంభ విషయంలో ప్రొటోకాల్ వివాదంతో కేశంపేట్ పోలీసులు సర్పంచ్ నవీన్‌కుమార్‌ను, ఎంపీటీసీ మల్లేష్‌ను ముందస్తుగా అదుపులోకి తీసుకొని కేశంపేట్ పోలీస్ స్టేషన్‌కు తరలించాలని భావించారు. వీరి అరెస్టు విషయం తెలుసుకొని బీఆర్ఎస్ కార్యకర్తలు స్టేషన్‌కు వస్తే శాంతి భద్రతల సమస్య వస్తుందని భావించి షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించాలని, అక్కడి నుంచి షాద్‌నగర్‌కు బయలుదేరారు. అక్కడ కూడా ఇదే సమస్య ఎదురవుతుందని, భావించి కొందుర్గు స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డిలు, కార్యకర్తలతో పోలీస్ స్టేషన్ వచ్చారు. విషయాన్ని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌కు, మహబూబ్‌నగర్ ఎంపీ శ్రీనివాస్‌రెడ్డికి తెలపడంతో వారు కొందుర్గు పీఎస్‌కు చేరుకుని ఎందుకు అరెస్ట్ చేశారంటూ షాద్‌నగర్ రూరల్ సీఐ లక్ష్మీరెడ్డిని ప్రశ్నించారు. ఏమైనా దొంగతనం చేశారా? ఎవరిపైనా ఆస్తులు ధ్వంసం చేశారా? అని ప్రశ్నించారు. ఎంపీ కలెక్టర్, సైబరాబాద్ కమిషనర్‌కు ఫోన్‌చేసి మాట్లాడారు. ఎంపీ చేతులమీదుగా భవనం ప్రారంభించాలని కార్యకర్తలు పట్టుబట్టారు. సీఐ ఎంపీతో, మాజీ ఎమ్మెల్యేతో పక్కకు వెళ్లి మాట్లాడారు. తాను కలెక్టర్‌తో మాట్లాడాడని, మరో తేదీకి ప్రారంభిద్దామని ఎంపీ కార్యకర్తలకు చెప్పినా వినలేదు. అనంతరం సొంతపూచీకత్తుపై విడుదల చేశారు.


కొత్తపేట గ్రామ పంచాయతీ భవనం వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

ఆర్భాటం కోసమే ప్రారంభోత్సవం

కొత్తపేట జీపీ భవనాన్ని కేవలం ఆర్భాటం కోసమే ప్రారంభించేందుకు బీఆర్ఎస్ నేతలు ఉత్సాహం చూపుతున్నారని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పంచాయతీ భవనం ఇంకా పూర్తి కాకపోవడంతో పాటు భవనాన్ని పంచాయతీరాజ్ శాఖ అధికారులకు కూడా అప్పగించలేదన్నారు. నూతన భవనాన్ని ప్రారంభించేందుకు రావల్సిందిగా సర్పంచ్ కోరగా ఈ నెల 26 తర్వాత కార్యక్రమం పెట్టుకోవాల్సిందిగా సూచించానని తెలిపారు. కాగా, కొత్తపేట జీపీ భవన ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే వీర్లపల్లి సమయం ఇస్తానని చెప్పినా సర్పంచ్, ఎంపీటీసీలతో పాటు బీఆర్ఎస్ నాయకులు రాజకీయాలు చేస్తున్నారని, ఇలాంటి విషయాలను సహించేది లేదని కాంగ్రెస్ కేశంపేట మండలాధ్యక్షుడు గూడ వీరేశ్ ఆరోపించారు. కొత్తపేటలో విలేకరులతో మాట్లాడుతూ భవన నిర్మాణ పనులు పూర్తికాకముందే ప్రారంభోత్సవం ఎందుకు చేస్తున్నారని వీరేశ్ ప్రశ్నించారు.

సంక్షిప్తంగా..

● **ఆమనగల్లు** : ఆమనగల్లు మండలం మేడిగడ్డ తండాలో శివాలయ నిర్మాణానికి స్థానికులు శ్రీకారం చుట్టారు. దాతల సహకారంతో నిర్మించే శివాలయ నిర్మాణ పనులకు సోమవారం స్థానిక సర్పంచ్ అమర్ సింగ్, తండా నాయక్ రవీందర్ నాయక్ ఆధ్వర్యంలో భూమి పూజ చేశారు. అంతకుముందు శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణంలో తండా వాసులంత పాలు పంచుకోవాలని కోరారు.

● **కడ్తాల్** : తిరుమల తిరుపతి దేవస్థానాన్ని సోమవారం పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డిలు సందర్శించారు. వేంకటేశ్వరుడిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

● **ఆమనగల్లు** : ఏఐసీసీ కార్యదర్శి, తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీని యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్, ఎన్ఎస్‌యుఐ మండల అధ్యక్షుడు ఎండీ ఫరీద్‌లు మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో కలిసి పూల బొకే అందజేసి శాలువాలతో సత్కరించారు.

● **శంషాబాద్** : తెలంగాణ రాష్ట్రాభివృద్ధికి అధికారం చేపట్టిన 40 రోజుల్లోనే రూ.40 వేల కోట్ల రూపాయల పెట్టుబడులను తెచ్చిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందని జీహెచ్ఎంసీ ఫ్లోర్‌లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. దావోస్ పర్యటన ముగించుకొని శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి స్వాగతం పలుకడానికి కాంగ్రెస్ నాయకులతో కలసి వచ్చిన ఆయన ఎయిర్‌పోర్టు వీవీఐపీ గేటు వద్ద మీడియాతో మాట్లాడుతూ ఈ విషయం పేర్కొన్నారు.

● **మహేశ్వరం** : మహేశ్వరం మోడల్‌స్కూల్‌లో 10 తగతి చదువుతున్న పి.సాయిచరిత జిల్లా స్థాయి గణిత ప్రతిభ పరీక్షలో ద్వితీయ స్థానంలో నిలిచింది. ప్రిన్సిపాల్ ధనుంజయ రూ.2వేల నగదుతో పాటు మెమోంటోను అందజేసి సత్కరించారు.

● **ఆమనగల్లు** : ఒక్కరి నేత్రదానంతో ఇద్దరికి దృష్టి భాగ్యం కలుగుతుందని లయన్స్‌క్లబ్ జిల్లా చైర్మన్ యాదయ్య అన్నారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో ఆమనగల్లు లయన్స్‌క్లబ్, ఎనుగొండ రాంరెడ్డి లయన్స్‌కంటి ఆసుపత్రిల సంయుక్త ఆధ్వర్యంలో ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు.

● **కందుకూరు** : కేంద్ర ప్రభుత్వం కార్మిక, కర్షకులపై చేస్తున్న కుట్రలను ఫిబ్రవరి 16 నుంచి ప్రజల వద్దకు తీసుకెళ్లనున్నట్లు రంగారెడ్డి జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు దుబ్బాక రాంచందర్ అన్నారు. మండల కేంద్రంలో మండల రైతు సంఘం కార్యదర్శి ఎ.కుమార్ అధ్యక్షతన జరిగిన కార్మిక, కర్షక మండల సదస్సులో పాల్గొని మాట్లాడారు. నాయకులు బి.బాల్‌రాజ్, ఆర్.శేఖర్, జి.సత్తయ్య, ఆర్.యాదయ్య, తదితరులున్నారు.

● **చేవెళ్ల** : ఎయిడ్స్ అంటు వ్యాధి కాదని నివారణ ఒక్కటే మార్గం అని ఉమ్మడి జిల్లా జాతీయ ఎయిడ్స్ కంట్రోల్‌సొసైటీ జిల్లా ఇంన్‌చార్జీ రామిరెడ్డి తెలిపారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ వారి సౌజన్యంతో చేవెళ్ల మండల కేంద్రంలో కళజాత బృందం ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఎయిడ్స్ అంటు వ్యాధి కాదని నివారణ ఒక్కటే మార్గం అన్నారు. ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈకార్యక్రమంలో సూపర్వైజర్ రాములు, కళాబృందం టీం సభ్యులు లింగయ్య, సైదులు, ఆంజనేయులు, వీర శ్రీరామ్, వాణీ తదితరులు ఉన్నారు.

● **కొందుర్గు** : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ వెంకటేష్ కోరారు. సోమవారం మండల పరిధిలోని విశ్వనాథ్‌పూర్‌లో వికసిత్ భారత్ సంకల్ప యాత్రను నిర్వహించారు. సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి, గ్రామస్థులు మాచిరెడ్డి, యాదయ్య, నర్సయ్య, ఇస్తారి, శంకరయ్య ప్రకాష్, శ్రీశైలం తదితరులున్నారు.

● **కేశంపేట** : మండల స్థాయిలో నిర్వహించిన గణితం పోటీలలో కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల తమ ప్రతిభను చాటారు. మండల కేంద్రంలో శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ పాఠశాలలలో చదువుకుంటున్న విద్యార్థులకు మండల స్థాయిలో గణితంలో ప్రతిభ పరీక్ష నిర్వహించారు. కొత్తపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థి అక్షయ ప్రథమ బహుమతి, వైష్ణవి ద్వితీయ బహుమతులు గెలుచుకున్నారు.

● **చౌదరిగూడ** : కేంద్ర ప్రభుత్వ పథకాలను నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కమ్మరి భూపాలచారి అన్నారు. పెద్ద ఎల్కిచర్ల, వాచ్యతండాలో వికసిత్‌భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ అమృతాజోసఫ్, ఎంపీహెచ్‌వో ప్రభులింగం, ఏఈవో గౌరీప్రియ, బీజేపీ మండలాధ్యక్షుడు కురుమయ్య తదితరులున్నారు.

● **షాబాద్** : మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో దోహదం చేస్తాయని షాబాద్ ఇన్‌స్పెక్టర్ యాదయ్యగౌడ్ అన్నారు. మాంటిసోరి గ్రూప్స్ యాజమాన్యం క్రీడాపోటీలను ఆయన పాల్గొని ప్రారంభించారు. నాయకులు రాజేందర్‌గౌడ్, వెంకట్‌యాదవ్, మాంటిస్సోరీ స్కూల్స్ సీఈవో జార్జ్ థామస్, కరస్పాండెంట్ మహేష్, హెడ్‌ఎం సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● **కందుకూరు** : కందుకూరు గ్రామానికి చెందిన తాళ్ల అంజయ్య సోమవారం లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఎక్స్‌టెన్షన్ అవార్డును అందుకున్నారు. నగరంలోని సికింద్రాబాద్‌లోని లయన్స్ భవనంలో జరిగిన కార్యక్రమంలో ఎల్‌సీఐఎఫ్(ఐఏఎస్) ఏరియా లీడర్ ఎస్ నరేందర్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.

● **కేశంపేట** : తన జన్మదినం సందర్భంగా ఓ ఉపాధ్యాయురాలు తాను చదువు చెబుతున్న పాఠశాల విద్యార్థులకు రూ.40వేలు ఖర్చుచేసి వైట్ యూనిఫాం అందించారు. కేశంపేట మండలం తొమ్మిదిరేకులు గ్రామ ప్రభుత్వ పాఠశాలలో హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న లావణ్య సోమవారం పాఠశాలలో ఎంఈవో మనోహర్ తోటి ఉపాధ్యాయులతో కలిసి జన్మదినం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆమెతో కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. తన జన్మదినం సందర్భంగా విద్యార్థులకు కుట్టించిన వైట్ యూనిఫాంలను ఎంఈవో చేతుల మీదుగా అందించారు.

క్రైం కార్నర్

ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య

శంకర్‌పల్లి, జనవరి 22 : ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై సంతోష్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఎల్వర్తి అనుబంధ గ్రామం కొజ్జగూడెంనకు చెందిన హరిశంకర్(23) ఫొటోగ్రాఫీలో రాణిస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. ఆదివారం రాత్రి పని నిమిత్తం బయటకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. అయితే, అదే రాత్రి ఫొటో స్టూడియోలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తెల్లవారుజామున కుటుంబసభ్యులు వెళ్లి చూసి బోరున విలపించారు. వారి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

కొందుర్గు, జనవరి, 22: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతిచెందిన ఘటన సోమవారం మండల పరిధిలోని వెంకిర్యాలలో జరిగింది. ఎస్సై కృష్ణయ్య కథనం మేరకు.. వెంకిర్యాలకు చెందిన బుడ్డోళ్ల బాలయ్య(40) కు ఇద్దరు భార్యలు. పెద్ద భార్య అమృత వెంకిర్యాలలో ఉంటుండగా, చిన్న భార్య లలిత లక్ష్మీదేవిపల్లిలో ఉంటుంది. ఆదివారం రాత్రి పెద్ద భార్య ఇంటికి పండ్లు తీసుకు వచ్చిన బాలయ్య.. తల్లికి ఇచ్చి, మళ్లీ లక్ష్మీదేవిపల్లికి వెళ్ళాడు. సోమవారం ఉదయం 6గంటల సమయంలో పెద్దభార్య కుమారుడు మహేష్ వచ్చి తన తండ్రి లక్ష్మీదేవిపల్లి రోడ్డు పక్కన పడి ఉన్నాడని తెలుపడంతో అమృత అక్కడికి వెళ్లి చూసి బోరున విలపించింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పాన్‌షాప్‌లో చోరీ

షాబాద్, జనవరి 22 : పాన్‌షాప్‌లో చోరీ జరిగిన ఘటన మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. బాధితుడు మహమ్మద్ సైఫ్ తెలిపిన వివరాల మేరకు.. శుక్రవారం రాత్రి ఎప్పటిలాగే షాప్ మూసి ఇంటికి వెళ్లాడు. శనివారం ఉదయం తెరిచి చూడగా సామాను కనిపించలేదు. సుమారు రూ.1.5 లక్షల సామాను, రూ.15వేల నగదు అపహరణకు గురైనట్లు వాపోయాడు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ బాల్‌రాజ్ షాప్ వద్దకు వచ్చి పంచనామా నిర్వహించారు.

సీఎం రేవంత్‌రెడ్డికి ఘనస్వాగతం

- దావోస్ పర్యటన ముగించుకొని హైదరాబాద్‌కు..
- శంషాబాద్ ఎయిర్‌పోర్టులో స్వాగతం పలికిన కాంగ్రెస్ నాయకులు

శంషాబాద్, జనవరి 22 : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దావోస్ పర్యటన ముగించుకొని సోమవారం హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో రేవంత్‌కు ఘనస్వాగతం పలికారు. పార్టీ శంషాబాద్ మండల, మున్సిపల్ అధ్యక్షులు గడ్డం శేఖర్‌యాదవ్, సంజయ్‌యాదవ్, టీపీసీసీ ఎస్సీ విభాగం ఉపాధ్యక్షుడు జెల్‌పల్లి నరేందర్, జీహెచ్ఎంసీ ఫ్లోర్‌లీడర్ రాజశేఖర్‌రెడ్డిలతో కలిసి పలువురు నాయకులు వీవీఐపీ గేటు వద్ద రేవంత్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ముఖ్యమంత్రి తన కాన్వాయ్‌లో నగరానికి బయలుదేరి వెళ్లారు. కాగా, ఎయిర్‌పోర్టు వద్ద కాంగ్రెస్ కార్యకర్తలు రేవంత్‌రెడ్డికి అనుకూలంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు.

అభివృద్ధి పనులు చేపట్టాలి : వీర్లపల్లి

షాద్‌నగర్, జనవరి 22 : నియోజకవర్గ ప్రజల అవసరాల మేరకు అభివృద్ధి పనులు చేపట్టాలని పంచాయతీరాజ్ అధికారులకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో సంబంధిత శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. గతంలో చేపట్టిన అభివృద్ధి పనుల గురించి ఆరా తీసారు. పూర్తయినవి.. పెండింగ్‌లో ఉన్న పనుల వివరాలను అందజేయాలన్నారు. అభివృద్ధి పనులకు నిధుల కొరత లేదన్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను కూడా పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులతో చర్చించి నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని తెలిపారు. డీఈ శ్రీనివాస్, ఏఈ గోపాల్ పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహ సంబంధాలు మెరుగు

షాద్‌నగర్, జనవరి 22 : క్రీడలతో మానసికోల్లాసంతో పాటు స్నేహ సంబంధాలు మరింత మెరుగుపడతాయని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం షాద్‌నగర్ పట్టణంలోని మున్సిపల్ స్టేడియంలో నిర్వహిస్తున్న షాద్‌నగర్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ మ్యాచ్ ముగింపు కార్యక్రమంలో పాల్గొని విజేతలకు ఎమ్మెల్యే శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డిలు బహుమతులను ప్రదానం చేశారు.

రాష్ట్రంలో పారదర్శక పాలన : కసిరెడ్డి


చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు, జనవరి 22: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శక పాలన అందిస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. ఆమనగల్లు, కడ్తాల మండలాల పరిధిలోని సోమవారం ఎమ్మెల్యే పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భైరాపూర్‌నకు చెందిన రమేశ్‌కు మంజూరైన రూ.1.25 లక్షల ఎల్‌వోసీ చెక్కును అందజేశారు. సిలార్‌పల్లిలో ఆంజనేయ స్వామి, గౌతమ బుద్ధుడు విగ్రహాలు, గ్రామ ముఖ ద్వార నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రామాంజనేయ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. నాయకులు శ్రీనివాస్‌గౌడ్, యాట నర్సింహ్మా, గూడూరు శ్రీనివాస్ రెడ్డి, కమ్లీమోత్యనాయక్, అనితవిజయ్, శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అదేవిదంగా ఆమనగల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల భూవివాదాన్ని పరిష్కరించాలని పలువురు స్థానికులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు.

'శంషాబాద్' వైస్ చైర్మన్‌పై చర్యలు తీసుకోవాలి'

శంషాబాద్, జనవరి 22 : భూ ఆక్రమణకు పాల్పడిన శంషాబాద్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ బండి గోపాల్‌యాదవ్‌పై చర్యలు తీసుకోవాలని టీపీసీసీ ఎస్సీ విభాగం ఉపాధ్యక్షుడు జె.నరేందర్, కౌన్సిలర్, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు సంజయ్‌యాదవ్‌లు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. శంషాబాద్‌కు చెందిన జి.లక్ష్మికి పది గుంటల భూమి రాళ్లగూడలో ఉందని, బండి గోపాల్‌యాదవ్ కొన్నేళ్ల క్రితం లీజుకు తీసుకున్నాడని పేర్కొన్నారు. అనంతరం ఆ భూమి తనదేనని చెపుతూ ఆక్రమించుకున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయం లక్ష్మి కుటుంబికులు గోపాల్‌యాదవ్‌ను అడగడానికి వెళితే బూతులు తిడుతున్నాడని, కొన్నేళ్ల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేయడానికి వెళితే పోలీసులను కూడా గోపాల్‌యాదవ్ తప్పుదోవ పట్టించాడని పేర్కొన్నారు. ఆయనపై చర్యలు తీసుకొని ఆక్రమించుకున్న భూమిని ఇప్పించాలని కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. నకలు కాపీని విలేకరులకు అందజేశారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి : ఎంపీపీ

మహేశ్వరం, జనవరి 22 : మండలంలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనుల్లో వేగం పెంచడంతో పాటు పెండింగ్‌లో ఉన్నవాటిని వెంటనే ప్రారంభించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీపీ ఆర్. సునితా అంద్యానాయక్ వివిధ శాఖల అధికారులకు సూచించారు. సోమవారం ఎంపీపీ చాంబర్‌లో అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా గ్రామాలతో పాటు ప్రధాన రహదారుల పనులు మధ్యలోనే ఆగిపోయాయని, కారణాలు తెలుసుకొని నివేదిక ఇవ్వాలన్నారు. ఎంపీడీవో బి.నర్సింహులు, డీఈ జగన్మోహన్‌రెడ్డి, ఎంఈవో కృష్ణ, విద్యుత్ ఏఈ చక్రపాణి, ఏపీఎం సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటిన ఇబ్రహీంపట్నం పోలీసులు

- మతి స్థిమితం సరిగాలేని వృద్ధురాలిని చేరదీసి కుటుంబ సభ్యులకు అప్పగింత

ఇబ్రహీంపట్నం, జనవరి 22: మతి స్థిమితం సరిగాలేని ఓ వృద్ధురాలిని సోమవారం ఇబ్రహీంపట్నం పోలీసులు చేరదీసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్ బాలాపూర్‌కు చెందిన నేనావత్ నవీన్ వద్ద ఉంటున్న వాళ్ల నాయనమ్మ చండి(70)కు కొంతకాలంగా మతి స్థిమితం సరిగా ఉండటం లేదు. ఇబ్రహీంపట్నం పరిధి ఉప్పరిగూడ వెళ్లే రోడ్డులో ఉన్న ఆమెను గస్తీ చేస్తున్న ఎస్సై రామకృష్ణ, కానిస్టేబుళ్ల ప్రేమలత, రాజులు ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. భోజనం పెట్టి ఆమె వద్ద ఉన్న సంచిలో దొరికిన ఫోన్‌నంబర్ ఆధారంగా మనవడు నవీన్‌కు ఫోన్ చేశారు. స్టేషన్ వచ్చిన మనవడికి ఆమెను అప్పగించారు. మూడు రోజుల క్రితం ఆమె ఇంటినుంచి వెళ్లిందని నవీన్ తెలిపాడు.